
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

సోమవారం 25 ఆగస్టు 2025

ఖనిజం నిగ్గుతేలేనా..?

- అక్రమ రవాణాతో ప్రభుత్వ ఆదాయానికి గండి
- కర్నూలు జిల్లాలో పట్టుబడడంతో వెలుగులోకి..
- వివరాలు వెల్లడించని అధికారులు



శ్రీనివాస మినరల్స్ క్రషర్ వద్ద ఖనిజ నిల్వల కొలతలు వేస్తున్న అధికారులు (ఫైల్)

యాడికి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఖనిజ రవాణాకు సంబంధించిన పర్మిట్ పేపర్లలో టెక్నాలజీని ఉపయోగించి మార్పులు, చేర్పులు చేసి ప్రభుత్వ ఆదాయానికి కొందరు మైనింగ్ యజమానులు, ఎండీఎల్ ట్రేడర్లు భారీగా గండికొడుతున్నారు. యాడికి మండలం రాయలచెరువుకు చెందిన ఒక మైనింగ్ యజమానికి చెందిన మూడు డోలమైట్ అక్రమ రవాణా లారీలను ఇటీవల కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద రీజనల్ విజిలెన్స్ అధికారులు పట్టుకోవడంతో ఈ దందా వెలుగులోకి వచ్చింది. డోలమైట్ ఖనిజ అక్రమ రవాణాపై అప్రమత్తమైన కర్నూలు విజిలెన్స్ అధికారులు యాడికి మండలం దైవాలమడుగు గ్రామం వద్ద సదరు గని వద్ద డోలమైట్ ఖనిజ నిల్వలను, శ్రీనివాస మినరల్స్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఎంత మొత్తంలో డోలమైట్ ఖనిజం అక్రమ రవాణా (మిగతా 7లో...)

గుత్తి మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గుత్తి-తాడిపత్రి మీదుగా సికింద్రాబాద్-తిరుపతి మధ్య అప్ అండ్ డౌన్ ఎనిమిది ట్రిప్పుల ప్రత్యేక వీక్లీ రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్-తిరుపతి ప్రత్యేక రైలు (నం. 07009) సెప్టెంబరు 4వ తేదీ నుంచి 25వ తేదీ వరకూ గురువారాలలోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07010) సెప్టెంబరు 5 నుంచి 26వ తేదీ వరకూ శుక్రవారాలలో నడపనున్నట్లు తెలియజేశారు. ఈరైలు కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్ నగర్, వనపర్తి రోడ్, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, రేణిగుంట స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

సిగ్గు.. సిగ్గు..!

ఇది జిల్లా విద్యాశాఖ కార్యాలయం. సొంత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎయిడెడ్ పాఠశాల అయిన గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్‌లోని గదులను తీసుకుని, అందులో కార్యాలయం నిర్వహిస్తున్నారు. అదే శాఖలో పదివేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రతినెలా కోట్ల రూపాయలు వారికి వేతనాలు చెల్లిస్తున్నారు. పిల్లలకు యూనిఫాం, పుస్తకాలు తదితరాల కోసం కోట్లలోనే ఖర్చు చేస్తున్నారు. అంత కీలకమైన శాఖకు సొంత భవనం లేదు. పాలకులు, ఉన్నతాధికారులు కొత్త భవనం నిర్మించే ఆలోచన కూడా చేయకపోవడం శోచనీయం. ఏళ్లుగా అక్కడే నిర్వహిస్తుండడంతో గిల్డ్ ఆఫ్ సర్వీస్ పాఠశాల యాజమాన్యం ఖాళీ చేయాలంటూ ఒత్తిడి తెచ్చింది. ఆ మేరకు గతంలో జిల్లా విద్యాశాఖాధికారి వినతిపత్రం కూడా అందజేసింది. జిల్లా ఉన్నతాధికారితో చెప్పించుకుని, వారి దయాదాక్షిణ్యాలతో జిల్లా కార్యాలయాన్ని అక్కడే నడుపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేస్తామన్న గత వైసీపీ పాలకులు.. జిల్లా కార్యాలయం కట్టలేకపోయారు. ప్రస్తుతం ఉన్న పరాయి భవనాల్లోని ఆఫీసుకు వెళ్లాలంటే వర్షం వచ్చినపుడు ఇలా బురద తొక్కుకుంటూ వెళ్లాల్సిందే.



వర్షం వస్తే డీఈఓ కార్యాలయంలోకి ఈ బురదలో వెళ్లాల్సిందే..

పరాయి భవనాల్లో విద్యాశాఖ, సమగ్రశిక్ష కార్యాలయాలు

- శిథిలావస్థకు చేరుకోవడంతో భయంభయంగా విధులు
- కనీస సౌకర్యాలు కరువు
- ఖాళీ చేయాలంటూ సంబంధిత శాఖల ఒత్తిళ్లు



ఇది సమగ్రశిక్ష కార్యాలయం. వేల సంఖ్యలో ఉద్యోగులు పనిచేస్తున్నారు. వారికి వేతనాలు ప్రతినెలా కోట్ల రూపాయల్లో చెల్లిస్తున్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లను నిర్వహిస్తుంది. అందులో చదువుతున్న విద్యార్థులకు భోజనం, వసతుల ఖర్చుల మొత్తం సొమ్ము ఈ శాఖ ద్వారానే చెల్లిస్తారు. ప్రతినెలా ఆ బిల్లులు కోట్లలోనే ఉంటాయి. అలాంటి కీలక విభాగానికి సొంత భవనం లేదు. ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన రేకుల షెడ్లలో కాలం వెల్లదీస్తున్నారు. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి. ఇక ఖాళీ చేయాలంటూ ఎస్సీ కార్పొరేషన్ నుంచి ఒత్తిళ్లు వస్తుండడంతో ఎటు పోవాలోనని ఉన్నతాధికారులు దిక్కులు చూస్తున్నారు.

అనంతపురం విద్య, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): 'కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతాం.. విద్యాప్రమాణాలు మెరుగుపరుస్తాం..' అంటూ ప్రభుత్వ పెద్దలు పదేపదే గొప్పలు చెబుతుంటారు. ఆ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యావ్యవస్థ అభివృద్ధి కోసం వివిధ పథకాలు తీసుకొచ్చి ఏటా రూ.కోట్లు (మిగతా 7లో...)

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే భక్తుల ఇలవేల్పుగా విరాజిల్లుతున్న గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం వేకువజామున ఆలయ ప్రధాన అర్చకులు రామాచార్యులు వివిధ పుష్పాలతో సుబ్రహ్మణ్యేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

సెల్ఫీ తెచ్చిన తంటా...

- కొండ పైనుంచి లోయలో పడిన తమిళనాడు వాసి
- కాపాడిన అగ్నిమాపక సిబ్బంది
- తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలు

(వివరాలు 7వ పేజీలో..)

విద్యాశాఖలో గందరగోళం

- విడుదలకాని డీఎస్సీ ఎంపిక జాబితా
- రాత్రి వరకు అభ్యర్థుల ఎదురుచూపులు
- ఏర్పాట్లు సిద్ధం చేసిన విద్యాశాఖ
- ఎట్టకేలకు సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా



సిబ్బందితో సమీక్షిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన అంశం ఇటు అధికారులు, అటు అభ్యర్థులను గందరగోళంలోకి పడేసింది. మెరిట్ లిస్ట్‌ను విడుదల చేశారు. ఇక రోస్టర్ కమ్ మెరిట్ లిస్టును తయారు చేసి ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటించాల్సి ఉంది. గతంలో మెరిట్ లిస్టు ఆధారంగా జిల్లాస్థాయిలో విద్యాశాఖ ఆధ్వర్యంలో సెలెక్షన్ జాబితాను తయారు చేసి కలెక్టర్ ఆమోదం తీసుకొని పోస్టింగులు ఇచ్చేది. అక్రమాలు, పొరపాట్లకు తావు ఇవ్వకూడదనే ఆలోచనతో ఈసారి రాష్ట్ర స్థాయిలోనే రోస్టర్ కమ్ మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక చేపట్టింది. అక్కడి నుంచే సెలెక్షన్ జాబితాను రూపొందించి ఎంపికైన అభ్యర్థులకు ఫోన్లు, మెయిల్స్‌కు మెసేజ్‌లు పంపాలని నిర్ణయించారు. మెసేజ్‌లు వచ్చిన అభ్యర్థులకు సోమవారం సర్టిఫికెట్ల పరిశీలిస్తామని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. ఆ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు సర్టిఫికెట్ల పరిశీలనకు 16 కమిటీలు ఏర్పాటు చేశారు. పరిశీలన ప్రక్రియను పీవీకేకే ఎంబీఏ కాలేజ్‌లో నిర్వహించడానికి ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు. ఆదివారం ఉదయంనుంచి రాత్రి వరకు సెలెక్షన్ జాబితాపై నిరీక్షణ సాగుతూ వచ్చింది. అభ్యర్థులకు ఎలాంటిమెసేజ్‌లు రాకపోవడంతో టెన్షన్‌తో ఎదురు చూశారు. మరోవైపు విద్యాశాఖ అధికారులు పరిశీలనలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేంద్రంలో ఏర్పాట్లలో నిమగ్నమైపోయారు. రాత్రి 10గంటల వరకు సెలెక్షన్ జాబితాపై రాష్ట్ర శాఖ నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల డీఎస్సీ టీచర్ల సెలెక్షన్ జాబితా విడుదలలో ఆలస్యమవుతోందని, సోమవారం జరగాల్సిన సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా వేస్తున్నామని రాష్ట్ర శాఖ ఉన్నతాధికారుల నుంచి జిల్లా అధికారులకు సమాచారం పంపారు. డీఈఓ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ.. సోమవారం జరగాల్సిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా పడిందని,తదుపరి తేదీని మళ్లీ తెలియజేస్తామని మీడియాకు తెలిపారు. మొత్తంమీద సెలెక్షన్ జాబితా విషయంలో గందరగోళం సాగడంతో అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు.

సెప్టెంబరులో సీఎం పర్యటన

- స్థలాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



గార్లదిన్నె వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్

అనంతపురం కలెక్టరేట్/అనంతపురం రూరల్/గార్లదిన్నె ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సెప్టెంబరు మొదటి వారంలో జిల్లా పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ బహిరంగ సభకోసం పలుచోట్ల స్థలాలను పరిశీలించారు. అనంతపురం రూరల్ మండలం కందుకూరు వద్ద అనంతపురం-కదిరి జాతీయ రహదారి పక్కన స్థలాన్ని పరిశీలించారు. అనంతపురం-బెంగళూరు జాతీయ రహదారి పక్కన రాప్తాడు మండలంలోని ఎంఐజీ లే అవుట్ వద్ద పరిశీలించారు. సీఎం సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అనంతపురం నగర సమీపంలో మరికొన్ని ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించాలని ఆర్డీఓ, తహశీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. గార్లదిన్నె మండలం కనుంపల్లి వద్ద 44వ జాతీయ రహదారి సమీపంలో స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, డీఎస్పీ వెంకటేశులు, తహసీల్దార్లు హరికుమార్, మోహన్‌రావు, ఈరమ్మ, ఎస్ఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చుక్కలు చూపుతున్నారు..!

- పరిష్కారానికి నోచుకోని చుక్కల భూముల సమస్యలు
- 8వేలకుగాను 81ఫైళ్లకే మోక్షం
- 22ఏ దరఖాస్తుల పరిస్థితీ అంతే..
- పైసలిస్తేనే ఫైళ్ల కదలిక

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో పైసలిస్తేనే ఫైళ్లు ముందుకు కదిలే పరిస్థితి. భూముల సమస్యలు పరిష్కరించుకోవడానికి తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వస్తోంది. చుక్కల భూములకు నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) తెచ్చుకోవాలంటే తల ప్రాణం తోకకొస్తోంది. ఆ సర్టిఫికెట్ తెచ్చుకుంటేనే భూమికి విలువ పెరుగుతుంది. సంవత్సరాలవుతున్నా వాటి సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. నిబంధనల మేరకు సంబంధిత డాక్యుమెంట్లు పొందుపరిచినా న్యాయం జరగడం లేదనే విమర్శలున్నాయి. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్డీఓ, కలెక్టరేట్ వరకు ఎక్కడ ఏ స్థాయిలో ఫైల్ నిలిచిపోయిందో తెలియని పరిస్థితి నెలకొంది. తహసీల్దార్ కార్యాలయాల్లో వందల సంఖ్యలో ఫైళ్లు పెండింగ్‌లో ఉండటం అధికారుల నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తోంది.

81ఫైళ్లకే మోక్షం

జిల్లాలోని 32 తహసీల్దార్ కార్యాలయాలకూ చుక్కల భూములు, 22ఏకి సంబంధించిన ఫైళ్లు వెళ్తుంటాయి. వాటిలో 80శాతం తహసీల్దార్ కార్యాలయాల్లో మూలుగుతున్నాయి. అనంతపురం డివిజన్ పరిధిలోని మండలాల్లో వందలు, వేలలో ఫైళ్లు ఉండగా... పదుల సంఖ్యలో కూడా పరిష్కారం కాలేదు. కళ్యాణదుర్గం డివిజన్‌లోనూ అదే పరిస్థితి. గుంతకల్లు డివిజన్‌లో చుక్కల భూములు సమస్యలు ఉన్నాయో, లేవో కానీ ఒకట్రెండు చొప్పున నమోదయ్యాయి. ఆ ఫైళ్లన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. అనంతపురం డివిజన్ పరిధిలో 6741 ఫైళ్లకుగాను 31కి మాత్రమే ఎన్‌ఓసీ దక్కింది. ఈనెల వరకు 16 మాత్రమే జిల్లాస్థాయి కమిటీ (డీఎల్‌సీ) మీటింగ్‌కు పంపారు. కళ్యాణదుర్గం డివిజన్‌లో 1252 ఫైళ్లకు 50 పరిష్కారమవగా.. 1202 పెండింగ్‌లో ఉన్నాయి. 18 మాత్రం డీఎస్‌సీకి పంపారు. గుంతకల్లు డివిజన్‌లో ఏడు మాత్రమే ఉండగా... ఒక్కటీ పరిష్కారం కాలేదు. డీఎల్‌సీకి ఒక్కటి కూడా పంపలేదు. మొత్తం 8వేలకిగాను 81 ఫైళ్లకే మోక్షం లభించింది. 39 ఫైళ్లనే డీఎస్‌సీకి పంపారు. ఇంకా 7,919 ఫైళ్లు పెండింగ్‌లోనే ఉన్నాయంటే తహసీలార్ ఆఫీసుల్లో ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థమవుతుంది.

22ఏ ఫైళ్లలో..

అనంతపురం డివిజన్‌లో 22ఏ ఫైళ్ల విషయంలో నిర్లక్ష్యం వహించడంలో రూరల్ మండలం మొదటి స్థానంలో నిలిచింది. ఇక్కడ 447 ఫైళ్లు ఉండగా.. గత ఎనిమిది నెలల్లో ఒక్కటి మాత్రమే పరిష్కారమైంది. అనంతపురం డివిజన్‌లో 1430ఫైళ్లకు 32 పరిష్కారమవగా.. 1398 పెండింగ్‌లో ఉన్నాయి. తాడిపత్రిలో 175 ఫైళ్లు ఉండగా మూడు, కళ్యాణదుర్గం డివిజన్‌లో 454కిగాను 33 ఫైళ్లకు మోక్షం లభించింది. గుంతకల్లు డివిజన్‌లో 349 ఫైళ్లకు 24 క్లియరెన్స్ దక్కింది. మొత్తం 2,233 ఫైళ్లలో 89 పరిష్కారమ్యాయి.

పైసలిస్తేనే కదలిక...

రెవెన్యూ శాఖలో ఎన్‌ఓసీ ఫైళ్లు కీలకం. తహసీల్దార్ కార్యాలయంలో ఫైళ్లు ఎక్కువగా పెండింగ్‌లో ఉంటున్నాయి. ఇక్కడ పైసలిస్తేనే పని జరుగుతోందన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. తహసీల్దార్లు, ఇతర సిబ్బంది బదిలీపై వెళ్తే... ఇక ఆ ఫైళ్లు ఎక్కడున్నాయో, వాటి స్టేటస్ ఏంటో ఎవరికీ అర్థం కాదు. జిల్లా యంత్రాంగం ఈ ఫైళ్ల విషయంలో చొరవ చూపి ప్రజలు, రైతులకు న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కుల వివక్షపై మా ఇంటి నుంచే పోరాటం

- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత
- అందరూ చదువుకోవాలి: ఎంపీ బీకే



రాప్తాడు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కుల వివక్షపై పరిటాల ఇంటి నుంచే పోరాటం ప్రారంభమయిందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మండలంలోని బండమీదపల్లిలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరయ్యారు. వారు అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఒక్క కులానికి, మతానికి చెందిన వ్యక్తి కాదని, ఆయన అందరివాడన్నారు. దేశానికి ఎంతో విలువైన రాజ్యాంగాన్ని అందించారని అన్నారు. అప్పట్లో దళితులను బావిలోకి దిగనిచ్చేవారు కాదని, దీనిని తొలిసారి వ్యతిరేకించింది తమ మామ పరిటాల శ్రీరాములు అని అన్నారు. ఎంపీ పార్థసారధి మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాలు నెరవేరాలంటే అన్ని వర్గాల వారు చదువుకోవాలని, ఉన్నత ఉద్యోగాలు సాధించడంతోపాటు రాజకీయాల్లోనూ రాణించాలన్నారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ.. అంటరానితనం రాజ్యమేలుతున్న సమయంలో అంబేడ్కర్ ఎన్నో డిగ్రీలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండప్ప, దగ్గుపాటి శ్రీనివాసులు, వెంకట్రాముడు, ముత్యాలప్ప, గోపాల్, రమణ, కిష్టా పాల్గొన్నారు.

హెచ్‌ఎంల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

- మళ్లీ జయరామిరెడ్డి, లక్ష్మీనారాయణకే అవకాశం



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న హెచ్‌ఎంలు, టీచర్లు

అనంతపురం విద్య, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయభవన్‌లో ప్రభుత్వ పరిధిలోని అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంల సంఘం జిల్లా నూతన కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించారు. హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడిగా నాలుగోసారి జయరామిరెడ్డి (కేశేపల్లి జడ్పీ హైస్కూల్), జిల్లా ప్రధాన కార్యదర్శిగా మూడోసారి లక్ష్మీనారాయణ(ముట్టాల జడ్పీ హైస్కూల్)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా హరినాథ్, గౌరవాధ్యక్షుడిగా బాలమురళీకృష్ణ, రాష్ట్రకౌన్సిల్ సభ్యులుగా విజయభాస్కర్‌రెడ్డి, మల్లికార్జున, సీఎం నారాయణరెడ్డి, హెడ్‌క్వార్టర్ సెక్రటరీగా రోషన్‌బాషా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మదన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకున్నారు. అదే విధంగా మహిళా హెచ్‌ఎంల ప్రతినిధిగా వసుంధర, మున్సిపాలిటీ హెచ్‌ఎంల ప్రతినిధిగా శ్యామ్‌సన్, అనంతపురం డివిజన్‌కు వైస్ ప్రెసిడెంట్‌గా బీసీ సుంకన్న, జాయింట్ సెక్రటరీగా పీఆర్‌వీ ప్రసాద్, కళ్యాణదుర్గం డివిజన్‌కు వైస్‌ప్రెసిడెంట్‌గా గోవిందప్ప, జాయింట్ సెక్రటరీగా ఆదిశేషయ్య, గుంతకల్‌కు వైస్‌ప్రెసిడెంట్‌గా ఎం.సుంకన్న, జాయింట్ సెక్రటరీగా శివశంకరెడ్డిని ఎన్నుకున్నారు. టెక్నికల్ సభ్యులుగా వెంకటప్రసాద్, గోపాల్‌నాయుడు, అబ్దుల్‌మునాఫ్, ఆడిట్ కమిటీ సభ్యులుగా విశ్వనాథ్, సూర్యనారాయణ, శంకరరెడ్డిలను ఎన్నుకున్నారు. నూతన కమిటీ నేతలకు పలువురు హెచ్‌ఎంలు, టీచర్లు అభినందనలు తెలిపారు.

ఉచిత ప్రయాణం.. చంద్రన్న కానుక: ఎమ్మెల్యే



ఉచిత బస్సు టిక్కెట్ చూపుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలు రాష్ట్రంలో ఎక్కడికయినా ఆర్టీసీ బస్సు ల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని, ఇది సీఎం చంద్రబాబు మహిళా లోకానికి ఇచ్చిన కానుక అని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. ఆదివారం శింగనమలలో స్త్రీ శక్తి పథకం విజయోత్సవ సభను నిర్వహించారు. ఉదయం ఎమ్మెల్యే మరవకొమ్మ క్రాస్ నుంచి శింగనమల వరకు మహిళలతో కలసి ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సభకు పెద్ద ఎత్తున మహిళలు తరవచ్చి ఎమ్మెల్యేకు సాగ్వతం పలికారు. మహిళలతో కలసి ఎమ్మెల్యే నృత్యం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి సీఎం ప్రత్యేక పథకాలు తీసుకు వచ్చారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, పాండు, ఎర్రినాగప్ప, బాలరంగయ్య, దండు శ్రీనివాసులు, డేగల కృష్ణమూర్తి మారుతినాయుడు, ఈశ్వర్‌రెడ్డి ఆదినారాయణ, షాలిని, ఆలం వెంకట నరసానాయుడు, చితంబరి దొర పాల్గొన్నారు.

నేడు డీఆర్సీ సమావేశం

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటీ (డీఆర్‌సీ) సమావేశం సోమవారం నిర్వహిస్తామని కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అమలుపై చర్చించనున్నారని పేర్కొన్నారు.

అరబిక్ రెస్టారెంట్‌లో ఎంగిలి బిర్యానీ..!

- తినగా మిగిలినది మరొకరికి సరఫరా (7లో)

తెనగల్లు.. టీచర్లకు పుట్టినిల్లు..!

- ఒకే గ్రామంలో 9 మందికి కొలువులు
- అందరూ పేద కుటుంబాలకు చెందినవారే..
- ఇప్పటి దాకా 40 మంది ఉపాధ్యాయులుగా ఎంపిక

7 లో



తెనగల్లు గ్రామం

అరబిక్ రెస్టారెంట్‌లో ఎంగిలి బిర్యానీ..!

- తినగా మిగిలినది మరొకరికి సరఫరా
- నిర్వాహకుల కక్కుర్తి
- కిలోల కొద్దీ కుళ్లిన ఆహార పదార్థాల నిల్వ
- కమిషనర్ తనిఖీతో బట్టబయలు


కుళ్లిన చికెన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కిరణ్‌కుమార్

కదిరి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): బయట అందమైన సోఫాలు, కుర్చీలు, టేబుళ్లతో విలాసంగా కనిపిస్తున్న ఆ హోటల్లో.. లోపల చూస్తే జీవితంలో ఇక బిర్యానీ ముట్టుకోరు.. కదిరి పట్టణ నడిబొడ్డున ఉన్న అరబిక్ రెస్టారెంట్‌లో కుళ్లిన పదార్థాలతో పాటు కస్టమర్లు తిని మిగిలిన పదార్థాలను కూడా తర్వాత వారికి వడ్డిస్తున్నారంటే ఎంత దారుణంగా ఉందో తెలుసుకోవచ్చు. ఆదివారం మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ తన సిబ్బందితో తనిఖీలు చేయడంతో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. కుళ్లిన ఆహార పదార్థాలు, ఫ్రిజ్‌లో గడ్డకట్టిన చికెన్, మాంసం కనిపించాయి. మూటలు మూటలుగా ఫ్రిజ్‌లో ఆహార పదార్థాలు మూలుగుతున్నాయి. తినగా మిగిలిన బిర్యానీ భద్రంగా దాచిపెట్టి, ఇతరులకు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉంచారు. మురుగునీటి పక్కనే తందూరి చికెన్ కడ్డీలు పెట్టారు. రెస్టారెంట్‌లో ఉన్న వంటగది అపరిశుభ్రంగా కంపు కొడుతోంది. వంటగదిలో కంపు కొట్టే మాంసం, చేపలు, మసాలాలు ప్రజల ఆరోగ్యాన్ని పాడు చేస్తున్నాయి. అరబిక్ రెస్టారెంట్‌పై అనేక ఫిర్యాదులు అందడంతో కమిషనర్ తనిఖీలు చేశారు. ఫ్రిజ్‌లో ఉన్న చికెన్‌ను తీయడానికి కూడా మున్సిపల్ సిబ్బందికి వీలుకాలేదు. డబ్బాలకొద్ది మసాల పేస్టులు తయారు చేసి, ఫ్రిజ్‌లో పెట్టేశారు. వాటి వాసన చూసి మున్సిపల్ సిబ్బంది ముక్కులు మూసుకున్నారు. ముందు రోజు ఇతరులు తినగా మిగిలిన బిర్యానీ ముక్కలతోపాటు అన్నం కూడా భద్రతగా దాచిపెట్టారు. చెడిపోయిన చికెన్‌ను వేడి నీటితో శుభ్రం చేసి, తిరిగి ఉపయోగించడం అధికారుల కంటపడింది. తందూరి కడ్డీలను ఎప్పుడు సిద్ధం చేశారోకానీ.. సింక్ (చేతులు శుభ్రం చేసుకునే) ప్రాంతం వద్ద అలాగే వదిలేశారు. పురుగులు పట్టిన ఆహార పదార్థాలను చూసి అధికారులు విస్తుపోయారు. రోజుల తరబడి నిలువ ఉంచిన ఆహారాన్ని ప్రజలకు ఏవిధంగా సరఫరా చేస్తున్నారని యజమానులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. అరబిక్ రెస్టారెంట్‌లో ఆహార కల్తీపై ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేశామన్నారు. తినగా మిగిలిన ఆహార పదార్థాలు, కుళ్లిన చికెన్, మటన్ గుర్తించామని అన్నారు. వెంటనే రెస్టారెంట్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

సెల్ఫీ తెచ్చిన తంటా...

- కొండ పైనుంచి లోయలో పడిన తమిళనాడు వాసి
- కాపాడిన అగ్నిమాపక సిబ్బంది
- తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలు


విఘ్నేష్‌ను బయటకు తీస్తున్న ఫైర్ అధికారులు

పెనుకొండ టౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): సెల్ఫీ పిచ్చితో ప్రాణాల మీదికి తెచ్చుకున్నాడు ఓ యువకుడు. ఆదివారం పట్టణం పక్కనే ఉన్న లక్ష్మీనరసింహ స్వామి కొండ అంచువరకు సెల్ఫీ తీసుకునేందుకు వెళ్లిన తమిళనాడు వాసి విఘ్నేష్ జారి లోయలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఇతడు జిల్లాలోని సోమందేపల్లి వద్దగల కియ అనుబంధ పరిశ్రమ డాంగులో పనిచేస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులతో కలిసి లక్ష్మీనరసింహస్వామి కొండపైకి వెళ్లాడు. కొండపై ప్రకృతి అందాలతో సెల్ఫీ తీసుకునే పిచ్చిలో కొండ అంచువరకు వెళ్లాడు. అక్కడి నుంచి జారి లోయలో పడిపోయాడు. వెంటనే అతడి స్నేహితులు.. అగ్నిమాపక శాఖాధికారులకు లోకేషన్ షేర్ చేశారు. పెనుకొండ ఫైర్ ఎస్‌ఓ వెంకటేశులు.. సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని, రెస్క్యూ ఆపరేషన్ చేసి, తాళ్లసాయంతో విఘ్నేష్‌ను పైకి తీసుకొచ్చారు. అప్పటికే కాలు, చేయి విరిగినట్లు గుర్తించారు. 108 సాయంతో పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

ఖనిజం నిగ్గుతేలేనా..?

(5వ పేజీ తరువాయి)


క్రషర్ వద్ద నిల్వ ఉంచిన డోలమైట్ ఖనిజం

జరిగిందో నివేదికలు తయారు చేయడానికి నాలుగు నుంచి ఐదు రోజుల సమయం పడుతుందని తెలిపారు. ఈనెల 18, 19తేదీల్లో రికార్డులు, ఖనిజం నిల్వలను పరిశీలించారు. డోలమైట్ ఖనిజం అక్రమ రవాణాపై ఏమి చర్యలు తీసుకున్నది ఇంతవరకూ అధికారులు వెల్లడించలేదు.

ఏమిటీ ఎండీఎల్..?

ఖనిజ రవాణాకు సంబంధించి మినరల్ డీలర్ లైసెన్స్ (ఎండీఎల్) పొందాల్సి ఉంటుంది. వీటిని మైన్స్ అండ్ జియాలజీ అధికారుల నుంచి పొందాలి. ఫ్యాక్టరీల యజమానులే కాకుండా ట్రేడర్స్ కూడా ఎండీఎల్‌లు తీసుకొని ముడి, పొడి ఖనిజాన్ని ఇతర రాష్ట్రాలకు ఇతర దేశాలకు కూడా విక్రయాలు చేయవచ్చు. ఖనిజాన్ని ఇతర రాష్ట్రాలకు రవాణాచేసే సమయంలో రవాణా చేసే వాహనం ట్రాన్సిట్ ఫాంను వెంట తీసుకువెళ్లాల్సి ఉంటుంది. ఈ ట్రాన్సిట్ ఫాంలో రవాణా చేసే ఖనిజం వివరాలు, తేదీ, సమయం, క్యూఆర్‌కోడ్ ఉంటుంది. ఖనిజాన్ని అక్రమ రవాణా చేసే ఖనిజ టన్నేజీని మార్పు చేసి దందాను కొనసాగిస్తున్నారు. ట్రాన్సిట్ ఫాంలో పదుల సంఖ్యలో ఉన్న టన్నేజీని సింగిల్ డిజిట్‌లోకి మార్చేస్తున్నారు. రాయల్టీ అధికారులను బురిడీ కొట్టిస్తూ యథేచ్ఛగా ఖనిజ అక్రమ రవాణా దందా కొనసాగిస్తున్నారు.

ఎలా మార్పు చేస్తున్నారంటే..

ఉదాహరణకు ట్రాన్సిట్ ఫాంలో 35 టన్నులకు తీసుకొని దానిని 3.5 టన్నులుగా మార్పు చేసుకుంటున్నారు. ట్రాన్సిట్ ఫాంలో 30 టన్నులు ఉంటే దానిని 3.0 టన్నులుగా మార్పు చేస్తున్నారు. ట్రాన్సిట్ ఫాంలో మార్పు చేసుకున్న విధంగా కేవలం 3 టన్నులకు మాత్రమే రాయల్టీ చెల్లించి మిగిలిన టన్నేజీకి రాయల్టీని ఎగ్గొట్టి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇలా కోట్ల రూపాయల రాయల్టీని ఎగవేస్తున్నారు.

పట్టుబడ్డారిలా..

యాడికి మండలం దైవాలమడుగు గ్రామం వద్ద శ్రీనివాస మినరల్స్ నుంచి కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్దకు డోలమైట్ ఖనిజ రవాణా వాహనాలను కర్నూలు రీజనల్ విజిలెన్స్ అధికారులు తనిఖీ చేయడంతో అక్రమ ఖనిజ రవాణా దందా వెలుగులోకి వచ్చింది. వాహనాల్లో తరలుతున్న ఖనిజ టన్నేజీకి, ట్రాన్సిట్ ఫాంలో ఉన్న టన్నేజీకి వ్యత్యాసం ఎక్కువగా ఉండడంతో మూడులారీలను సీజ్ చేశారు. అనంతరం తాడిపత్రి మైన్స్ అండ్ జియాలజీ అధికారులతో కలిసి శ్రీనివాస మినరల్స్ వద్దకు వచ్చారు. మైన్స్ వద్ద నిల్వచేసిన ఖనిజాన్ని కొలతలు వేసి రికార్డులను పరిశీలించడంతో దందా వెలుగులోకి వచ్చింది.

నివేదిక ఆధారంగా చర్యలు



దైవాలమడుగు గ్రామం వద్ద శ్రీనివాస మినరల్స్ నుంచి డోలమైట్ ఖనిజం అక్రమ రవాణా జరుగుతున్నట్లు కర్నూలు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. అక్కడ తనిఖీలు నిర్వహించారు. ఖనిజ నిల్వలపై సర్వే చేశారు. కర్నూలు విజిలెన్స్ అధికారులు ఇచ్చే నివేదిక ఆధారంగా ఎటువంటి చర్యలు చేపట్టాలనేది తేలుతుంది. ఖనిజం అక్రమ రవాణా చేసి ప్రభుత్వ ఆదాయానికి గండికొడితే కఠిన చర్యలు తప్పవు.

-ఓబులరెడ్డి, ఏడీఏ, గనులు భూగర్భవనరుల శాఖ, తాడిపత్రి

తెనగల్లు.. టీచర్లకు పుట్టినిల్లు..!

- ఒకే గ్రామంలో 9 మందికి కొలువులు
- అందరూ పేద కుటుంబాలకు చెందినవారే..
- ఇప్పటిదాకా 40 మంది ఉపాధ్యాయులుగా ఎంపిక


ఎస్. లక్ష్మణమూర్తి


జె. జ్యోతి


కె. శ్రీకాంత్


బండి తేజ


యశ్వినీ భాను


పి. నీలకంఠేశ్వరప్ప


హరీశ్


గంగాధర


కె.సురేశ్ బాబు


చంద్రశేఖర్

కుందుర్పి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఆ గ్రామం పేరుచెబితేనే ప్రభుత్వ ఉద్యోగాలు గుర్తుకు వస్తాయి. ఉపాధ్యాయ పోస్టులకయితే అది పుట్టినిల్లుగా మారింది. కుందుర్పి మండలంలోని తెనగల్లు గ్రామానికి చెందిన నిరుద్యోగులు డీఎస్సీ ఫలితాల్లో సత్తా చాటారు. శుక్రవారం ప్రకటించిన ఫలితాల్లో తెనగల్లుకు చెందిన 9 మంది ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. దీంతో ఆ గ్రామంలో టీచర్ పోస్టులకు ఎంపికయిన వారు 40 మంది దాకా ఉన్నారు. అందరూ మధ్య తరగతి, వ్యవసాయ కూలీలు, పేద కుటుంబాలకు చెందిన వారే. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో 9 మంది టీచర్ ఉద్యోగాలు సాధించారు. జిల్లా స్థాయిలో.. ఎస్. లక్ష్మణమూర్తి ఎస్ఏ ఫిజిక్స్‌లో 57.57 మార్కులతో 282వ ర్యాంక్, జె. జ్యోతి ఎస్‌జీటీ 85.95 మార్కులతో 54వ ర్యాంక్, కె. శ్రీకాంత్ ఎస్‌జీటీ 84.51 మార్కులతో 86వ ర్యాంక్, బండి తేజ ఎస్‌జీటీ 88.88 మార్కులతో 23వ ర్యాంక్, యశ్వినీ భాను ఎస్ఏ బయాలజీ 78.44 మార్కులతో 31వ ర్యాంక్, పి.నీలకంఠేశ్వరప్ప ఎస్ఏ సోషల్ 76.45 మార్కులతో 51వ ర్యాంక్, హరీష్ ఎస్ఏ పీఈటీ 76.5 మార్కులతో 85వ ర్యాంక్, గంగాధర ఎస్ఏ సోషల్ 73.04 మార్కులతో 92వ ర్యాంక్, కె. సురేశ్‌బాబు ఎస్ఏ పీడీ 92 మార్కులతో 2వ ర్యాంక్ సాధించారు. అదేవిధంగా మండల పరిధిలోని కరిగానిపల్లికి చెందిన చంద్రశేఖర్ ఎస్ఏ తెలుగు 76.47 మార్కులతో 33వ ర్యాంక్ సాధించారు. ఇతడే పీజీటీ జిల్లా స్థాయిలో 68.60 మార్కులతో 201వ ర్యాంక్ సాధించారు. రెండు ఉద్యోగాలకు అర్హత సాధించారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులు కోల్పోయినప్పటికీ ఆత్మస్థైర్యంతో కష్టపడి చదివి విజయం సాధించారు.

ఒకరికే... మూడు ఉద్యోగాలు


సాయి చందన

కళ్యాణదుర్గం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కంబదూరు సహకార సంఘం సీఈవోగా పనిచేస్తున్న ముత్యాలప్ప మొదటి కుమార్తె ఆర్. సాయి చందన ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో మూడు ఉద్యోగాలు సాధించింది. టీజీటీ బయాలజీ జోన్-4లో 81.79 మార్కులతో 5వ ర్యాంక్, అనంతపురం జిల్లా స్థాయిలో స్కూల్ అసిస్టెంట్ బయాలజీలో 83.13 మార్కులతో 8వ ర్యాంక్, ఎస్‌జీటీలో 84.54 మార్కులతో 84వ ర్యాంక్ సాధించింది. దీంతో ఆ కుటుంబంలో ఆనందాలు వెల్లివిరిశాయి. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఇంతటి ఘన విజయాన్ని సాధించినట్లు ఆమె తెలిపారు.

అత్త ప్రోత్సాహంతో మూడో ర్యాంకు


గంజి రాశి

కూడేరు(ఆంధ్రజ్యోతి): టీచర్ కావాలన్న లక్ష్యంతో నిరంతరం శ్రమించిన గంజి రాశికి అత్త నీలమ్మ ప్రోత్సాహం, భర్త మధు సహకారం తోడవడంతో డీఎస్సీ ఎస్జీటీ పోస్టుల్లో జిల్లాలో మూడో ర్యాంకు సాధించారు. కూడేరు మండలం జల్లిపల్లికి చెందిన గంజి రాశి చదువుల్లో బాగా రాణిస్తుండటంతో కుటుంబ సభ్యులు ప్రోత్సాహం దక్కింది. గ్రామంలో సెంటు భూమిలేని ఆ నిరుపేద కుటుంబానికి చదువుల తల్లే దిక్కయింది. డీఎస్సీ-2018లో 72.63 కటాఫ్ మార్కులు కాగా.. గంజిరాశికి 72.53 రావడంతో కేవలం 0.10 అతి తక్కువ మార్కులతో ఉద్యోగం చేజారింది. దీంతో ఏడాది క్రితం అనంతపురంలో అద్దె ఇంట్లో ఉంటూ.. ఏడాది క్రితం పుట్టిన చంటి బిడ్డను అత్త వద్దనే వదిలి సాయిగంగ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకున్నారు. టెట్ పరీక్షలో 150 మార్కులకు 149.56 మార్కులతో జిల్లాలో రెండో ర్యాంక్ సాధించింది. ఈ ఏడాది నిర్వహించిన డీఎస్సీ పరీక్షల్లో 100 మార్కులకు గంజి రాశికి 92.46 మార్కులు రావడంతో జిల్లాలో మూడో ర్యాంక్ సాధించి ఎస్జీటీ పోస్టు దక్కించుకుంది. దీంతో ఉద్యోగం సాధించిన కోడలికి అత్త నీలమ్మ స్వీట్ తినిపించింది. అత్త నీలమ్మ ప్రోత్సాహం, భర్త మధు సహకారంతోనే తాను టీచర్ పోస్టు సాధించానని ఆమె తెలిపారు. ఆమె భర్త మధు ఓ ప్రైవేటు కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.

మద్దకవారిపల్లిలో నలుగురికి..


ఎం. విష్ణువర్ధన్


ఎ.చంద్రకళ


బి. వెంకటరమణ


సి.గీతాంజలి

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఒకే గ్రామంలో నలుగురికి ఉపాధ్యాయ పోస్టులు రాగా.. వారిలో ఒకతను ఏకంగా నాలుగు పోస్టులకు ఎంపికయ్యారు. మండలంలోని తంగేడుకుంట పంచాయతీ మద్దకవారిపల్లిలో డీఎస్సీ పరీక్షల్లో నలుగురు ఉపాధ్యాయ పోస్టులను దక్కించుకున్నారు. మద్దక విష్ణువర్దన్ స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషు 78.5 మార్కులతో 24వ ర్యాంకు, టీజీటీ ఇంగ్లీషులో 75 మార్కులతో 70వ ర్యాంకు, సోషియల్ 72.16 మార్కులతో 62వ ర్యాంకు, ఎస్‌జీటీ తెలుగు 86.2 మార్కులతో 161వ ర్యాంకు, చంద్రకళ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్సులో 82.53 మార్కులతో 4వ ర్యాంకు, టీజీటీ సైన్సులో 67.5 మార్కులతో 40వ ర్యాంకు, జె. వెంకటరమణ స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషులో 77.34 మార్కులతో 37వ ర్యాంకు, ఎం. గీతాంజలి స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్‌లో 75.5 మార్కులతో 101వ ర్యాంకు సాధించి, ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యారు. వీరితోపాటు ఇదే పంచాయతీలోని బుచ్చిరాజుపల్లికి చెందిన ఎ. సోముశేఖర్ టీజీటీ సోషియల్‌లో, తంగేడుకుంట హర్షియాబాను ఎస్జీటీ పోస్టులు సాధించారు.

పీఈటీ మొదటి ర్యాంకర్‌కు ఎమ్మెల్యే సన్మానం


ఉమామహేశ్‌ను సన్మానించి జ్ఞాపికను అందిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో పీఈటీ విభాగంలో జిల్లాలో మొదటి ర్యాంకు, రాష్ట్రంలో రెండో ర్యాంకు సాధించిన ఉమామహేశ్‌ను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు సన్మానించారు. ఆదివారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద కంబదూరు మండలం నూతిమడుగు గ్రామానికి చెందిన నాయీబ్రాహ్మణ ఉమామహేశ్‌ను ఎమ్మెల్యే సన్మానించి, జ్ఞాపికను అందచేశారు. అనంతరం నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ విడుదల చేయడంతో ఎంతోమంది నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించి తమ కలను నెరవేర్చుకున్నారని అన్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో కళ్యాణదుర్గంలో ఉచిత మెగా డీఎస్సీ శిక్షణ ఇచ్చి ఎంతో మంది నిరుద్యోగులకు బాసటగా నిలవడంతో వారు ఉద్యోగాలు సాధించారని కొనియాడారు.

తోపుడుబండి వ్యాపారి కూతురికి రెండు ఉద్యోగాలు


పార్వతి

అనంతపురం క్లాక్‌టవర్(ఆంధ్రజ్యోతి): తోపుడు బండి వ్యాపారి కూతురు రెండు ఉద్యోగాలకు ఎంపికయింది. నగరంలోని పాతూరులో నివాసముంటున్న తోపుడుబండి వ్యాపారులు శ్రీనివాసులు, మంగాదేవిలకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురుని చదవించకోలేక వివాహం చేశారు. రెండోకూతురు పార్వతిని తోపుడుబండి వ్యాపారం చేస్తూనే డిగ్రీ, డీఈడీ చదివించారు. పార్వతి కష్టపడి చదివి గత నెలలో విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాలలో ఉద్యోగానికి ఎంపికయింది. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లోనూ 83.28 మార్కులు సాధించి ఎస్‌జీటీ పోస్టుకు ఎంపికయింది. టెట్‌లోనూ 150 మార్కులకు గాను 139 మార్కులు సాధించింది. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివించారని పార్వతి తెలిపారు. కానిస్టేబుల్ పోస్టుకు ఎంపికైనా...ఎస్జీటీగా వెళ్తానని అన్నారు. తమ కూతురు రెండు ఉద్యోగాలకు ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.


తోపుడుబండి వద్ద వ్యాపారం చేస్తున్న పార్వతి తల్లిదండ్రులు

ఫర్టిలైజర్స్ దుకాణాల్లో విజిలెన్స్ దాడులు

అనంతపురం క్రైం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): యూరియా స్టాక్ ఉన్నా..నో స్టాక్ బోర్డు పెడితే..కఠిన చర్యలు తప్పవని రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వైబీపీటీఏ ప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో విజిలెన్స్, వ్యవసాయ అధికారులు పలు ప్రాంతాల్లోని ఫర్టిలైజర్స్ దుకాణాల్లో దాడులు చేశారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని ఆరు షాపుల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఉన్న స్టాక్‌కు, ఈపోస్ మిషన్లలో ఉన్న వివరాలకు తేడా ఉన్నట్లు గుర్తించారు. రూ.15.37 లక్షల విలువ చేసే వివిధ రకాల 60.18 మెట్రిక్ టన్నుల ఎరువులను తాత్కాలికంగా అమ్మకాలు చేయరాదని వ్యాపారులకు నోటీసులు ఇప్పించారు. కార్యక్రమంలో సీఐలు శ్రీనివాసులు, జమాల్ బాష, వ్యవసాయాధికారి వాసుప్రకాష్, డీసీటీఓ సురేష్‌కుమార్, ఎస్ఐలు గోపాలుడు, నరేంద్ర భూపతి, ఏఓలు శ్యాంసుందర్‌రెడ్డి, ఓబిరెడ్డి, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

సిగ్గు.. సిగ్గు..!

(5వ పేజీ తరువాయి)

ఖర్చు పెడుతున్నాయి. పుస్తకాల నుంచి యూనిఫాం, చివరకు పౌష్టికాహారం వరకు సర్కారు బడుల్లో చదువుతున్న పిల్లలకు ఉచితంగా అందజేస్తూ ప్రతినెలా రూ.కోట్లు ఖర్చు పెడుతున్నారు. అలాంటి పాఠశాలలకు నిధులిచ్చి పర్యవేక్షించే విద్యాశాఖ, సమగ్రశిక్ష కార్యాలయాల పరిస్థితి మాత్రం జిల్లాలో దారుణంగా ఉంది. ఈ రెండు శాఖలకు సొంత భవనాలు లేవు. పరాయి భవనాల్లో నడుపుతున్నారు. అక్కడ సరైన వసతులు లేకపోయినా ఆయాశాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బందులు పడుతూనే విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ భవనాలు ఇతర శాఖలకు చెందినవి కావడంతో వారు తమ భవనాలు ఇచ్చేయాలంటూ ఒత్తిడి తెస్తుండడం శోచనీయం. ఇక వివిధ పనుల మీద ఆయా కార్యాలయాలకు వచ్చే టీచర్లు అక్కడ ఉన్నతాధికారులు, ఉద్యోగులు పడుతున్న కష్టాలు చూసి షాక్ అవుతున్నారు.

ఎయిడెడ్ పాఠశాలలో..


ప్రభుత్వ శాఖల్లోనే అత్యధిక మంది ఉద్యోగులు విద్యాశాఖలో ఉంటారు. నెలకు సరాసరిగా ఈ శాఖకు చెందిన టీచర్లు, అధికారులు, ఉద్యోగులకు రూ.10కోట్లకుపైగా వేతనాల రూపంలో చెల్లిస్తారు. అలాంటి కీలక శాఖకు సొంత భవనంలేదు. కమలానగర్‌లోని సొంత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో రాష్ట్ర ఉన్నతాధికారులు వచ్చినపుడు మార్చాలని సీరియస్‌గా ఉచిత సలహా ఇచ్చి వెళ్లారు. అద్దెలు కట్టలేమనడంతో గిల్డ్ ఆఫ్ సర్వీస్ ఎయిడెడ్ స్కూల్‌కు చెందిన ఓ భాగాన్ని మరమ్మతులు చేయించుకుని, అక్కడ కొన్నేళ్లుగా డీఈఓ కార్యాలయం నిర్వహిస్తున్నారు. చిన్న చిన్న గదుల్లో జిల్లా అధికారులు ఉండాల్సి వస్తోంది.

సమగ్రశిక్షదీ ఇదే దుస్థితి..

పాఠశాలల అభివృద్ధి, కొత్తభవనాల నిర్మాణం, వసతుల కల్పన, కేజీబీవీలు, భవిత కేంద్రాలు, పిల్లలకు యూనిఫాం, పుస్తకాలు, రవాణాభత్యం తదితరాలను సమగ్రశిక్ష శాఖ ద్వారానే అందజేస్తారు. ప్రతినెలా ఆ శాఖ పరిధిలో పనిచేసే అధికారులు, ఉద్యోగులు, వివిధ కేడర్ల సిబ్బందికి రూ.3.50 కోట్లు జీతాల రూపంలోనే చెల్లిస్తున్నారు. భవనాలు, ల్యాబ్‌లు, డార్మెటరీలు, మైదానాలు, క్రీడలు తదితరాల నిర్మాణాలకు ఏటా కనీసం వంద కోట్ల వరకు జిల్లాలో వ్యయం చేస్తున్నారు. అలాంటి సమగ్రశిక్ష శాఖ కార్యాలయానికి సొంత భవనం లేదు. గతంలో ప్రైవేటు అద్దె భవనాల్లో నడుపుతుండేవారు. అద్దె ఎందుకు చెల్లించాలని నగరానికి దూరంగా ఉన్న ఎస్సీ కార్పొరేషన్ శాఖకు చెందిన ఓ శిక్షణ కేంద్రంలో నడుపుతున్నారు. అక్కడ కూడా గదులకు పైకప్పులు రేకులతో వేసుకుని, కాలం వెళ్లదీస్తున్నారు. వర్షంవస్తే అవి కారుతున్నాయి. భవనాలను ఖాళీచేసి వెళ్లాలని ఎస్సీ కార్పొరేషన్ శాఖ నుంచి ఒత్తిడి ఉంది. వేరే అవకాశం లేక అధికారులు, సిబ్బంది వాటిలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇలా జిల్లాలో అత్యంత కీలకమైన విద్యాశాఖ, సమగ్రశిక్ష శాఖలకు సొంత కార్యాలయాలు లేక దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు.


కమలానగర్‌లో ఉన్న పాత డీఈఓ కార్యాలయం


పాత కార్యాలయం స్థానంలో నిర్మిస్తే అనుకూలం



కమలానగర్‌లో ఉన్న డీఈఓ పాత కార్యాలయాన్ని కూల్చి, అక్కడే విద్యాశాఖ, ఎస్ఎస్ఏకి కొత్త భవనాలు నిర్మిస్తే అందరికీ అనుకూలంగా ఉంటుంది. కీలకమైన కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడం బాధాకరం. వెంటనే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొత్తభవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

-నాగేంద్ర, యుటీఎఫ్ సీనియర్ నేత

విలువైన స్థలాన్ని కాపాడాలి



కమలానగర్‌లో డీఈఓ కార్యాలయం శిథిలావస్థకు చేరిందని వసతులులేని మరోచోట నిర్వహిస్తున్నారు. పాత కార్యాలయం స్థలంలో చిన్నచిన్న దుకాణాలు పెట్టుకుని, వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇలాగే వదిలేస్తే కోట్ల విలువ చేసే స్థలం అన్యాక్రాంతమవుతుంది. వెంటనే పాత కార్యాలయాన్ని పడగొట్టి, ఆ స్థలంలో కొత్త భవనాన్ని నిర్మించాలి.

-కులశేఖర్ రెడ్డి, ఏపీటీఎఫ్ నేత

కొత్త కార్యాలయం నిర్మించాలి



డీఈఓ కార్యాలయంలో కనీస వసతులేక అధికారులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కొత్త కార్యాలయ భవన నిర్మాణానికి పాలకులు, ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి.

- డీవీఎస్ ప్రకాష్‌రావు, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నాయకుడు

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం



డీఈఓ కార్యాలయానికి సొంతభవనం లేక ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. స్వయంగా వచ్చి డీఈఓ కార్యాలయాన్ని పరిశీలిస్తానని కలెక్టర్ తెలిపారు. ఆ తర్వాతనే సొంతభవనం ఏర్పాటుపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

-ప్రసాద్‌బాబు, డీఈఓ

ఎమ్మెల్యే కార్యాలయం ముట్టడికి ఎన్టీఆర్ ఫ్యాన్స్ యత్నం

- అడ్డుకున్న పోలీసులు
- ఫ్యాన్స్ అరెస్టు, స్టేషన్లకు తరలింపు


ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వెనుక వైపున ఎన్టీఆర్ ఫ్యాన్స్, పోలీసుల మధ్య తోపులాట

అనంతపురం క్రైం, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ వ్యాఖ్యలకు నిరసనగా.. ఆయన క్యాంపు కార్యాలయం ముట్టడికి జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఆదివారం యత్నించారు. తెలుగు రాష్ట్రాలతోపాటు బళ్లారి తదితర ప్రాంతాల నుంచి భారీగా వాహనాల్లో ఎన్టీఆర్ ఫ్యాన్స్ అనంతపురం తరలివచ్చారు. పోలీసులు అప్రమత్తమై ఎక్కడికక్కడ అభిమానులను అడ్డుకుని, స్టేషన్లకు తరలించారు. కొంతమంది అభిమానులు నగరంలోని శ్రీనగర్ కాలనీలోగల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వైపు వెళ్లేందుకు యత్నించారు. ఎమ్మెల్యే బహిరంగంగా క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేశారు. పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఫ్యాన్స్‌ను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి, స్టేషన్లకు తరలించారు. దీంతో సమస్య సర్దుమణిగింది. ఇతర ప్రాంతాల నుంచి అభిమానులు వస్తున్నారంటూ... ప్రచారం సాగడంతో ఉదయం నుంచీ మధ్యాహ్నం 2 గంటల వరకూ హైటెన్షన్ నెలకొంది. పోలీసు బలగాలు సైతం ఉదయం నుంచీ సాయంత్రం వరకూ పహారా కాస్తూ... గడిపారు.

రచయితలు సమాజాన్ని ముందుకు నడిపించాలి

● ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి



ద్విదశాబ్ది పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రచయితలు సమాజాన్ని ముందుకు నడిపించాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. స్పందన అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరశాస్త్రి రచించిన 'ద్విదశాబ్ది' పుస్తకావిష్కరణ సభను ఆదివారం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని కామర్స్ సెమినార్ హాల్లో నిర్వహించారు. రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. జీవితం మీద నమ్మకం, ఆశ కల్పించే దిశగా రచనలు చేసిన కవులను సత్కరించి, వారి కవిత్వ విశ్లేషణ వ్యాసాలను గ్రంథస్థం చేసిన చంద్రశేఖరశాస్త్రి కృషి అభినందనీయమన్నారు. ద్విదశాబ్ది పుస్తకం ఎదుగుతున్న కవులకు కరదీపికగా ఉపకరిస్తుందన్నారు. అనంతరం పుస్తక రచయిత చంద్రశేఖరశాస్త్రి దంపతులను సాహితీవేత్తలు ఘనంగా సత్కరించారు. డాక్టర్ అంకె శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు కృపాకర్ మాదిగ, నందవరం కేశవరెడ్డి, నాగేశ్వరాచారి, షమీఉల్లా, జీఎస్ఎన్ ప్రసాద్, యాములపల్లి నర్సిరెడ్డి, విశ్వనాథరెడ్డి, ఏలూరు యంగన్న, అప్పిరెడ్డి హరినాథరెడ్డి, అక్షరమాలి సురేష్, గొల్లాపిన్ని సీతారామశాస్త్రి, జెట్టి జయరాం, వీరభద్రప్ప, వన్నప్ప, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు సరుకుల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న డీఎస్పీ మహబూబ్‌బాషా తదితరులు

అనంతపురం టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను పురస్కరించుకుని చంద్రయాన్ సేవాసమితి వారు స్థానిక ఆదరణ సేవా హోమ్‌లో ఆదివారం పలు అర్చక కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి దిశ డీఎస్పీ మహబూబ్‌బాషా ముఖ్య అతిథిగా హాజరై వాటిని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ... కులమతాలకు అతీతంగా చంద్రయాన్ సేవాసమితి వారు ముస్లింలకు రంజాన్ తోఫా, క్రిస్టియన్లకు క్రిస్మస్ కానుక, హిందువులకు ఉగాది, దసరా, వినాయక చవితి పండుగలకు నిత్యావసర సరుకులు అందజేస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షుడు చంద్రశేఖర్, వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ చైర్మన్ కాగజ్ ఘర్ రిజ్వాన్, ఆదరణ సేవా సంస్థ లాల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరగాలి: డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం క్రైం, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా సాగేలా నిర్వాహకులు చూడాలని అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. నగరంలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, ఇతర మత పెద్దలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉత్సవాలు ప్రశాంతంగా సాగేలా చూడాలన్నారు. గణేశ్ మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. ఉత్సవాల నిర్వహణలో అల్లర్లు, ఘర్షణలకు తావులేండా నిర్వాహకులే బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ మతసామర్యం పాటించాలన్నారు. సాంస్కృతి కార్యక్రమాల పేరిట రికార్డింగ్ డ్యాన్సులు వంటివి నిర్వహిస్తే.. చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పశువుల సంత ఆదాయం రూ.2.37లక్షలు

అనంతపురంరూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్ లో జరిగిన పశులసంతతో రూ.2.37 లక్షల ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.1.30 లక్షలు, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1.07 లక్షల ఆదాయం మార్కెట్‌కు వచ్చినట్లు పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

అనంతపురం టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత అని శ్రీనివాసనగర్ రామాలయం ధర్మకర్త ఆళ్లగడ్డ రాము పేర్కొన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని రామాలయం వద్ద ఆదివారం దాదాపు 200 మందికి మట్టి వినాయక విగ్రహాలను ఆయన ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత ఏడు సంవత్సరాలుగా ప్రతియేటా వందలాదిమందికి మట్టి వినాయక వినాయక విగ్రహాలను అందిస్తున్నట్లు తెలిపారు. మట్టి విగ్రహాలను పూజించి.. పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని సూచించారు. శ్రీవారి సేవకులు ప్రకాష్, ముఖేష్, శివశంకర్‌రెడ్డి, అనీల్, ప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇషా గ్రామోత్సవ క్రీడాపోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఇషా ఫౌండేషన్ 17వ గ్రామోత్సవ వాలీబాల్ క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. ఇందులో అగలి జట్టు విజేతగా నిలవగా, తరిమెల జట్టు ద్వితీయ స్థానం, ఉరవకొండ జట్టు తృతీయ స్థానం, ఎంఎం హళ్లి జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. ముఖ్య అతిథిగా త్రీటౌన్ సీఐ శాంతిలాల్ హాజరై విజేత జట్లకు నగదు బహుమతి, సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లా స్థాయి విజేతలు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ పద్మశ్రీ, పీడీ శ్రీరామ్, ఇషా ఫౌండేషన్ వలంటీర్లు ఆదిత్య, రవితేజ, హిమకర్, ప్రణీత్, ప్రియాంక, మాలతి, లాస్య, మణిరామ్, సర్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న సీఐ శాంతిలాల్



ఎన్టీఆర్ పార్కు ప్రవేశద్వారం వద్ద చెత్తకుప్పలు



వృథాగా జిమ్ పరికరాలు



కంపచెట్లతో నిండిపోయిన పార్క్‌లో పందుల సంచారం



తుప్పు పట్టిన శ్రీకృష్ణదేవరాయ విగ్రహం

అధ్వానంగా ఎన్టీఆర్ ఉద్యానవనం

● ఆహ్లాదానికి దూరం.. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా
● వైసీపీ హయాంలో నిర్వహణ గాలికి..
● అభివృద్ధి చేస్తే మరో మినీట్యాంక్ బండ్‌గా రూపాంతరం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ రోడ్డులో చెరువుకట్టపై నిర్మించిన ఎన్టీఆర్ ఉద్యానవనం అధ్వానంగా తయారైంది. 2019 ఫిబ్రవరి 21వ తేదీన అప్పటి కలెక్టర్ వీరపాండియన్, అప్పటి అర్బన్ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి ఈ ఉద్యానవనాన్ని ప్రారంభించారు. ఏడాదిపాటు బాగానే నిర్వహించారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఐదేళ్ల పాటు ఆ పార్కు నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేశారు. నగరవాసులతో పాటు బుక్కరాయసముద్రం, నార్పల, గార్లదిన్నె, శింగనమల మండలాల ప్రజలు కుటుంబంతో వచ్చి సరదాగా ఆహ్లాదకర వాతావరణంలో గడిపేందుకు ఈ పార్కును సుమారు 8 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. మినీ ట్యాంక్‌బండ్‌ను కూడా ఏర్పాటు చేశారు. అయితే గత వైసీపీ హయాంలో నిర్వహణ లేకపోవడంతో అది కాస్తా అధ్వానంగా మారింది.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..

లక్షలాది రూపాయలతో ఏర్పాటు చేసిన పార్కు వల్ల ఆహ్లాదం సంగతి అటు ఉంచితే...అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పార్కు ప్రవేశంలో చెత్తదిబ్బలు, కోళ్ల వ్యర్థాలతో తీవ్ర అపరిశుభ్రత నెలకొంది. పందులు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఏపుగా పెరిగిన కంపచెట్లతో అడవిని తలపిస్తోంది. దీంతో ప్రజలు ఆ పార్కు వైపు కన్నెత్తికూడా చూడలేకపోతున్నారు. ఇదే అదునుగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు ఆ ప్రదేశాన్ని అడ్డాగా మార్చుకున్నారు. ఓ వైపు చెరువు, సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు, మరోవైపు అనంత నగరం ఈ పార్కుకి ఇరువైపులా ఉన్నాయి. ప్రజలు ఉదయం వాకింగ్ చేయడానికి ట్రాక్, వ్యాయామానికి అనువుగా జిమ్ కూడా ఏర్పాటు చేశారు. ఉపయోగంలో లేక జిమ్ పరికరాలు వృథాగా ఉండిపోయాయి. శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం, మేడ్ ఇన్ ఇండియా సింబల్‌తో ఏర్పాటు సింహం విగ్రహాలు తుప్పు పట్టిపోయాయి.

మళ్లీ అందుబాబులోకి తీసుకురావాలి..

నగరంలోని పాతూరు ప్రజలు ఇరుకు సందుల్లో, అధిక వాహనాల రాకపోకల రొద నడుమ, వాతావరణ కాలుష్యం మధ్య అసౌకర్యంగా జీవిస్తున్న పరిస్థితి. వారు కుటుంబ సభ్యులతో ఆహ్లాదంగా, ప్రశాంతంగా మానసిక ఉల్లాసంతో గడపాలంటే సమీప పరిసరాల్లో అనువుగా ఓ పార్క్ ఏర్పాటు చేయాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. అనుకున్నదే తడవుగా చెరువుకట్టపై ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో ఎన్టీఆర్ పేరుతో ఉద్యానవనం ఏర్పాటు చేసింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక పరిస్థితి తారుమారు అయింది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ, మైనర్ ఇరిగేషన్ అధికారులు ఎన్టీఆర్ పార్కును పరిశీలించి.. మళ్లీ అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని నగరవాసులు కోరుతున్నారు.

రక్తదానం పట్ల అవగాహన కలిగి ఉండాలి: డీఆర్‌డీఏ పీడీ



రక్తదాతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

అనంతపురం టౌన్, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): రక్తదానం పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, రక్తదానం చేయడం వల్ల మరొకరికి పునర్జన్మ ఇచ్చినట్లు అవుతుందని డీఆర్డీఏ పీడీ శైలజ పేర్కొన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, ఎన్టీఆర్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో నగర శివారు ఎన్టీఆర్ మార్గ్‌లోని బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయంలో ఆదివారం రక్తదాన శిబిరం జరిగింది. డీఆర్‌డీఏ పీడీ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తదానంపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. రక్తందానం చేయడం వల్ల క్షీణిస్తామన్న అపోహ చాలా మందిలో ఉందని, అది వాస్తవం కాదని, రక్తదానం చేసిన 24 గంటల్లోనే కొత్త రక్తం ఉత్పత్తి అవుతుందని తెలిపారు. అనంతరం దాదాపు 100 మంది రక్తదానం చేశారు. రక్తదాతలందరికీ పీడీ ప్రశంసాపత్రాలు అందజేశారు. రక్తదానం చేసినవారిలో సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయి కుమార్ 104వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అతడిని ముఖ్యఅతిథులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి శారద, ప్రభుత్వాస్పత్రి ఆర్థోపెడిక్ సర్జన్ మహ్మద్ గౌస్, ధన్వంతరి హాస్పిటల్ శివకుమార్, తాహా ఆయుర్వేదిక్ ఆస్పత్రి మాలిక్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ రూ.1.86 కోట్లు మోసం

● ఇక ఆత్మహత్యే శరణ్యం
● విలేకరుల సమావేశంలో ఇంటీరియర్ డిజైనర్ శరత్‌బాబు ఆవేదన



మాట్లాడుతున్న బాధితుడు శరత్‌బాబు

అనంతపురం క్రైం, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): అమెరికా అట్లాంటాలో ఉండే ఎన్ఆర్ఐ గుంటిపల్లి సురేంద్రబాబు ఇంటి కన్‌స్ట్రక్షన్‌కు సంబంధించిన డబ్బులు రూ.1.86 కోట్లు చెల్లించకుండా మోసం చేశారంటూ ఇంటీరియర్ డిజైనర్ శరత్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. రుద్రంపేటలోని ఓ ప్రైవేట్ స్కూల్లో ఆదివారం ఆయన తనమిత్రులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్థానిక శ్రీచైతన్య స్కూల్‌కు ఎదురుగా ఉన్న ఓ ఇంటి రిన్నోవేషన్ కోసం తన మిత్రుడు మహేష్ ద్వారా ఎన్ఆర్ఐ సురేంద్ర బాబు తనను సంప్రదించారన్నారు. ఆయన అమెరికాలో ఉండటంతో ఎలాంటి అగ్రిమెంట్ రాసుకోకుండానే ఇంటి పనులు చేశానన్నారు. సుమారు రెండున్నరేళ్ల పాటు జరిగే పనులను కేవలం 13 నెలల్లోనే పూర్తి చేశానన్నారు. ఇంటి పనుల కోసం అడిగినప్పుడు కొంత మాత్రమే ఇచ్చేవారన్నారు. 10 లక్షలు అడిగితే... రూ.2 లక్షలు లేదా రూ.3 లక్షలు ఇచ్చేవారన్నారు. ఇంటి కోసం సుమారు రూ.4 కోట్ల పైచిలుకు వ్యయం అయిందన్నారు. ఇప్పటి వరకూ సురేంద్రబాబు కేవలం తనకు రూ.2.19 కోట్లు మాత్రమే ఇచ్చారని, మిగతా 1.86 కోట్లు చెల్లించలేదని వాపోయారు. ఆ డబ్బులు అడిగితే ఇంటి ఓపెనింగ్ రోజు ఇస్తానంటూ చెప్పుకొచ్చాడన్నారు. గత ఏడాది డిసెంబరు 26న ఇంటి ఓపెనింగ్ జరిగిందని, ఆ రోజు డబ్బు అడిగితే.. తెచ్చానని, అయితే మరోపని కోసం వాడుకున్నానని, అమెరికా వెళ్లిన తర్వాత ఇస్తానని చెప్పి వెళ్లిపోయాడన్నారు. తర్వాత జనవరి నుంచి తన ఫోన్‌తోపాటు, తన భార్య, మరో ఇద్దరి ఫోన్లు కూడా బ్లాక్ లిస్టులో పెట్టి స్పందించడం లేదన్నారు. నా మాట నమ్మి వెండర్లు కోట్ల రూపాయల విలువైన మెటీరియల్ ఇచ్చారని, ఇప్పుడు తాను వాళ్లకు ఎలా చెల్లించాలని, తనకు ఆత్మహత్యే శరణ్యమంటూ వాపోయారు. ఎన్ఆర్ఐ మోసంపై ఎస్పీకి ఫిర్యాదుచేశానని, తర్వాత 4వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సైతం కేసు పెట్టినట్టు తెలిపారు. పోలీసులు తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

టమోటా కిలో రూ.34

అనంతపురంరూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో ఆదివారం కిలో టమోటాలు గరిష్ఠంగా రూ.34తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.20, సరసరా ధర రూ.27తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,850 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఉత్సాహంగా ఆటల పండుగ

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛందసంస్థ సహకారంతో చిగురు ఆధ్వర్యంలో చిన్నారుల ఆటల పండుగ ఎంతో ఉత్సాహంగా జరిగింది. చెన్నేకొత్తపల్లిలోని సీవైఆర్‌సీ ప్రాంగణంలో ఆదివారం ఈ ఆటల పండుగ ను నిర్వహించారు. ప్రధానంగా సంచులాట, కప్పగంతులాట, మ్యూజికల్ చైర్స్ తదితర పోటీలు నిర్వహించారు. అనంతరం బహుమతులను ప్ర దానం చేశారు. టింబక్టు కలెక్టివ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుకన్య మాట్లాడుతూ... పిల్లలు చదువుతోపాటు ఆటల్లో కూడా ముందుండాలన్నారు. ఆటల వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. టింబక్టు కలెక్టివ్ సంస్థ ఏటా ఈ ఆటలపండుగను నిర్వహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో చిగురు మేనేజర్ సతీశ్, కో ఆర్డినేటర్ పూర్ణిమ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక అధ్యక్షుడిగా గజేంద్రమోహన్

అనంతపురం టౌన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): చెరువుకట్ట అయ్యప్పస్వామి ఆలయ కమిటీ తాత్కాలిక అధ్యక్షుడిగా గజేంద్రమోహన్ నియమితుడయ్యారు. గతంలో ఈ స్థానంలో ఉన్న బుట్నా మణికంఠను తొలగిస్తూ కమిటీ తీర్మాణించింది. అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఆదివారం ఆలయ కమిటీ, శ్రీసాయి అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో మణికంఠపై వచ్చిన ఆరోపణలు, మినిట్స్ బుక్, బైలా తదితర అంశాలపై పాలక వర్గం చర్చించింది. ఈ నేపథ్యంలో ఆ ఆరోపణలు నిజమేనని పరిగణిస్తూ ఆయన్ను అధ్యక్షస్థానం నుంచి తొలగించారు. కాగా కొత్త కమిటీ ఎన్నిక జరిగేవరకూ తాత్కాలిక అధ్యక్షుడిగా ప్రస్తుత ఉపాధ్యక్షుడు గజేంద్రమోహన్‌కు బాధ్యతలు అప్పగిస్తూ కమిటీ సభ్యులు తీర్మాణించారు. కార్యక్రమంలో సాయి అయ్యప్ప సేవాసమాజం ప్రధాన కార్యదర్శి నాగలింగారెడ్డి, సహాయ కార్యదర్శి కేశవరెడ్డి, సభ్యులు రామకృష్ణ, రాము, గురుస్వామి కుర్లపల్లి రంగాచారి, గౌరవ సలహాదారులు భవాని రవికుమార్, ఆర్యవైశ్య యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శబరి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏళ్లనాటి సమస్యకు పరిష్కారం

● పులేటిపల్లి వద్ద రోడ్డుపై కల్వర్టు నిర్మాణానికి శ్రీకారం
● చొరవ చూపిన ఎమ్మెల్యే పరిటాల సునీత



పైపులు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక చొరవతో ఏళ్లనాటి సమస్య పరిష్కారమైంది. మండలంలోని పులేటిపల్లి నుంచి మేడాపురానికి వెళ్లే రహదారిపై నీళ్లు పారుతుండేవి. ముఖ్యంగా ప్రతి ఏటా వర్షాలు వచ్చినప్పుడు పులేటిపల్లి చెరువు నిండి మరువ పారినప్పుడు నీరు పెద్దఎత్తున రోడ్డుపై పారుతుండేవి. ఆ సమయంలో ప్రయాణించాలంటే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుండేవారు. ఇటీవల ఎమ్మెల్యే పరిటాల సునీత పులేటిపల్లికి వెళ్లినప్పుడు గ్రామస్థులు ఈ సమస్యను తెలిపారు. దాదాపు కొన్నేళ్ల నుంచి ఇ బ్బంది పడుతున్నామని, పరిష్కరించాలని విన్నవించారు. దీంతో స్పందించిన ఆమె ఆ రోడ్డుపై కల్వర్టు నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చెప్పిందే తడవుగా అధికారులు సైతం కల్వర్టు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం పనులు జరుగుతుండడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గుంతలమయంగా జాతీయ రహదారి

● ప్రమాదాల బారినపడుతున్న వాహనదారులు
● పట్టించుకోని అధికారులు



రామదాసుపేట వద్ద హైవేపై గుంతలను పరిశీలిస్తున్న పోలీసులు

గార్లదిన్నె, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం మీదుగా వెళ్లే 44వ జాతీయ రహదారి తీవ్ర గుంతలమయంగా మారింది. ఆ రోడ్డులో నిత్యం హైదారాబాద్- బెంగుళూరు వైపు అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే అడుగుకో గుంత ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురువుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో కల్లూరు నుంచి లోలూరు క్రాస్ వరకు జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున గుంతలు పడ్డాయి. వాటి వల్ల వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. వాహనాలు వేగంగా వెళుతూ ఓవర్ టేక్ చేసే సమయంలో గుంతల వల్ల వాహనాలు అదుపు తప్పుతూ ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ క్రమంలో ఎంతో మంది ప్రయాణికులు గాయాల పాలవుతున్నారు. కొందరు ప్రాణాలే కోల్పోతున్నారు. కార్లు, లారీలు, బస్సులు వెనుక వెళ్లే ద్విచక్ర వాహనాలు, ఆటోలు గుంతలలో అదుపు తప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించే ఈ జాతీయ రహదారి ఇంత అధ్వానంగా ఉన్నా పట్టించుకునేవారే కరువయ్యాడని వాహనదారులు వాపోతున్నారు. ఈ గుంతలు వర్షానికి పడ్డాయా...? లేక నాసిరకం రకం పనుల వల్ల పడ్డాయా అనేది తెలియాల్సి ఉంది. సంబంధిత అధికారులు జాతీయ రహదారికి మరమ్మతులు చేసి ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైన ఉందని వాహనదారులతో పాటు ప్రజలు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

కల్లూరు నుంచి లోలూరు వరకు ఉన్న హైవేపై పెద్దఎత్తున గుంత లు పడ్డాయి. ముఖ్యంగా రామదాసుపేట, తలగాసిపల్లి గ్రామాల వద్ద అధికంగా గుంతలు పడ్డాయి. వాటి వల్ల వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఆ గుంతలను వెంటనే పూడ్చివేయాల్సి న అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయంపై హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

-ఎస్ఐ మహమ్మద్ గౌస్‌బాషా

ఏఎంసీ కాంట్రాక్టర్ల కార్యవర్గం ఎన్నిక

● అధ్యక్షుడిగా సరిపూటి శ్రీకాంత్ ఏకగ్రీవం



ఏఎంసీ కాంట్రాక్టర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఏఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. కాంట్రాక్టర్స్ అసోసియేషన్ వారు సమావేశం నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా కేపీ రత్నయ్య, అధ్యక్షుడిగా సరిపూటి శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా జీ. మురళీమోహన్ రెడ్డి, కే. ప్రీతమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా తరుణ్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా సీ. ఇస్మాయిల్, వై. లక్ష్మీనారాయణ, కోశాధికారులుగా ఎన్.శ్రీనివాసులు, వీ. రామకృష్ణతో పాటు గౌరవ సలహాదారులుగా కే వేణుగోపాల్ రెడ్డి, ఎస్.వెంకటేష్, ఏ.శివశంకరయ్య, ఎం.ప్రభాకర్‌రా వు, డీ.నారాయణ, కే.సత్య నారాయణమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. నగరంలో తమకు అప్పజెప్పిన పనులను నాణ్యతతో చేసి ప్రజల మన్నలను పొందుతూ, అధికారులకు జవాబుదారిగా పనిచేస్తామని తెలిపారు.

'దివ్యాంగ క్రీడాకారులకు ప్రభుత్వం అండ'



పోస్టర్లు విడుదల చేస్తున్న నారాయణస్వామి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ క్రీడాకారులకు, పారా క్రీడలకు సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఏపీ వికలాంగుల, వృద్ధపౌరుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ నారాయణస్వామి తెలిపారు. స్థానిక ఇండోర్‌స్టేడియంలో ఈనెల 28వ తేదీన నిర్వహించే మొదటి పారా రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ జూనియర్, యూత్ పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం ఆయన ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మొదటి సారి జిల్లాలో జరుగుతున్న రాష్ట్రస్థాయి పారా బ్యాడ్మింటన్ పోటీలలో దివ్యాంగ క్రీడాకారులు సత్తా చాటి, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలని ఈ సందర్భంగా చైర్మన్ ఆకాంక్షించారు. దివ్యాంగ క్రీడాకారులకు సీఎం చంద్రబాబు ఎప్పుడూ అండగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు శివప్ప, తదితరులు పాల్గొన్నారు. వివరాలకు 9390388169, 8074106154 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ సుపరిపాలనపై ప్రచారం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని 11 ఏళ్ల కేంద్ర ప్రభుత్వ సుపరిపాలనపై బీజేపీ నాయకులు ఆదివారం నగరంలో ప్రచారం చేశారు. జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ ఆధ్వర్యంలో పాతూరు రాణినగర్, రైల్వేస్టేషన్, రెవెన్యూకాలనీ తదితర ప్రాంతాలలో ఇంటింటా తిరిగి ప్రజలకు, రోడ్లపై వ్యాపారులకు కరపత్రాలు పంచుతూ మోదీ నాయకత్వంలో 11 ఏళ్ల కేంద్రప్రభుత్వం సుపరిపాలనపై అవగాహన కల్పించారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా ప్రధాని మోదీ ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిరని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బోనాల మారుతి గోవిందప్రసాద్, ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, కార్యదర్శి పోగుల నాగేంద్ర, మండల అధ్యక్షుడు చిరంజీవి, ఐటీ సెల్ కన్వీనర్ భీమశేఖర్, ఓబీసీ మోర్చా చక్రధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామం తప్పనిసరి: డీఎస్పీ

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ప్రతి ఒక్కరు ఒత్తిడితో కూడుకున్న జీవితాన్ని కొనసాగిస్తున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో సంపూర్ణ ఆరోగ్యం పొందాలంటే వ్యాయామం తప్పని సరి అని ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. చెన్నేకొత్తపల్లిలో పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ జరిగింది. ఇందులో పోలీసు అధికారులు, సిబ్బంది స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి జాతీయ రహదారి వరకు సైకిల్ తొక్కుతూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. సైకిల్ తొక్కడం కూడా ఒక మంచి వ్యాయామమని అన్నారు. గతంలో సైకిల్‌ను ఎక్కువగా ఉపయోగించే వారని, కాలానుగుణంగా ప్రస్తుతం సైకిల్ వాడకం తగ్గిపోయిందని అన్నారు. ప్రతి ఒక్కరు సైకిల్ తొక్కడం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రామగిరి సీఐ శ్రీధర్, ఎస్ఐలు సత్యనారాయణ, మహమ్మద్ రిజ్వాన్, సిబ్బంది పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ధర్మవరం డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు

గుంతకల్లు కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరు

పట్టు కోసం మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్ పాట్లు
రెండు జాబితాలను ప్రకటించిన వైనం
పరస్పరం విమర్శలు

గుంతకల్లు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పట్టణ, మండలాల కమిటీల ప్రకటనల విషయంతో స్థానిక కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు ముదిరి పాకాన పడింది. డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి దౌల్తాపురం ప్రభాకర్ ఆధిపత్యం కోసం వేర్వేరు జాబితాలను ఆదివారం ప్రకటించారు. ప్రత్యక్ష విమర్శలకు దిగారు.

● జిల్లా సదస్సులో బట్టబయలు..
గత డిసెంబరులో స్థానిక కమిటీల నియామకంలో ప్రభాకర్, మధుసూదన్‌రెడ్డి మధ్య కోల్డ్‌వార్ నడిచింది. నియోజకవర్గ ఇన్‌చార్జి పదవికి పట్టణానికి చెందిన తిమ్మారెడ్డిని .. పట్టణాధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి రంగంలోకి తెచ్చారు. కానీ పదవిని పొందిన రోజే తిమ్మారెడ్డి మరణించాడు. ఆయన స్థానంలో ఎవరిని నియమించాలన్న విషయంగా ప్రభాకర్‌కు, మధుసూదన్‌కు మధ్య విభేదాలు చెలరేగాయి. అంతేకాకుండా రెండు నెలల కిందట పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అనంతపురంలో నిర్వహించిన నియోజకవర్గాల సమన్వయ సమావేశంలో గుంతకల్లు నాయకులు బాహాబాహీకి దిగారు.



మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్

● రెండు జాబితాలు..
కమిటీల ఎంపికలో స్థానిక నాయకులు కొందరు డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డిని ఆశ్రయించారు. డీసీసీ అధ్యక్షుడు సూచన మేరకు జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడు ఆలం నవాజ్, ఫిరోజ్ నియోజకవర్గంలోని పట్టణ, మండలాల కమిటీల జాబితాను ఆదివారం ప్రకటించారు. గుంతకల్లు పట్టణ అధ్యక్షుడిగా ఎం మహేంద్రను, పామిడి పట్టణ అధ్యక్షుడిగా సుబ్బయ్యను ప్రకటించారు. దీనికి పోటీగా ప్రభాకర్ కూడా గుంతకల్లు పట్టణ అధ్యక్షుడిగా టీ రామాంజనేయులు, పామిడి పట్టణాధ్యక్షుడిగా తలారి ఆంజనేయులు పేర్లను ప్రకటించారు. అయితే గుత్తి పట్టణాధ్యక్షుడిగా ఇద్దరూ సిరాజుద్దీన్ పేరునే ప్రకటించారు.

నాదే అధికారిక జాబితా
-మధుసూదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు

స్థానిక కమిటీలను నియమించే అధికారం డీసీసీలకు కట్టబెడుతూ ఏఐసీసీ సమావేశం తీర్మానించింది. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశాల మేరకే గుంతకల్లు మండల, పట్టణ కమిటీలను ప్రకటించాం. ఈ జాబితాలో ఉన్నవారిని జిల్లా కేంద్రానికి రప్పించి నియామక పత్రాలు అందజేస్తాం. ప్రభాకర్ పోటీగా వేరే పేర్లను ప్రకటించి పార్టీని ధిక్కరిస్తున్నాడు. అతను స్వప్రయోజనాలతో పార్టీ శ్రేణులను దూరం చేసుకున్నాడు. పార్టీ అతడిని తొలగించాలని అనుకుంటోంది.

మధుతో పార్టీ భ్రష్టు
-దౌల్తాపురం ప్రభాకర్, నియోజకవర్గ ఇన్‌చార్జి

ఆయనకు అధికారం.. సంబంధం లేకపోయినా గుంతకల్లు నియోజవర్గ కమిటీల నియామకంలో మధుసూదన్‌రెడ్డి జోక్యం చేసుకొని.. నాకు సరిపోని వ్యక్తులను ఎగదోస్తున్నాడు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నుంచి వచ్చిన జాబితానే నేను ప్రకటించా. పీసీసీ ఆదేశించకపోయినా గుంతకల్లు మండల, పట్టణ కమిటీలను ప్రకటించాడు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయానికి వస్తున్న షాపుల ఆదాయంపై కన్నేసిన కొందరు ఇలా నీచ రాజకీయాలు చేస్తున్నారు. మధుసూదన్‌రెడ్డి గ్రూపు రాజకీయాలు చేస్తున్నారు. ఈ విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాను.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు కోరారు. స్థానిక హంపిరెడ్డి భవనంలో సీఐటీయూ అనుబంధమైన మున్సిపల్ పట్టణ సీఐటీయూ 4వ మహాసభను ఆదివారం నిర్వహించారు. సీఐటీయూ జెండాను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ... జిల్లాలో ఏడుగురు శాసన సభ్యులు, ఆర్థిక మంత్రి ఉన్నా ... మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోవడం దారుణమన్నారు. మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, రెగ్యులర్ కార్మికులకు డీఏలు, ఇంక్రిమెంట్లు చెల్లించాలని అన్నారు. అనంతరం మున్సిపల్ సీఐటీయూ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా నరసయ్య, అధ్యక్షుడిగా శామ్యూల్, కార్యదర్శిగా రంగనాయకులు, కోశాధికారిగా రవి, సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, సాకే నాగరాజు పాల్గొన్నారు.

● తాడిపత్రి: స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మహాసభలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, సీనియర్ నాయకులు జ్యోతిలత హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక హక్కులను నిర్వీర్యం చేసిందన్నారు. కార్మికులు తమ ప్రాణాలను అర్పించి సాధించుకున్న కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం అధికారం వచ్చిన తర్వాత నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు.

ఈ లేబర్‌కోడ్ వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికుల సంఘటితమై వాటి రద్దు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. లేబర్‌కోడ్ వల్ల కార్మికులు ఎటువంటి హక్కులు ఉండవన్నారు. ముఖ్యంగా తాడిపత్రి పట్టణ పరిసరాల్లో అనేక సిమెంట్, స్టీల్ పరిశ్రమలు ఉన్నాయన్నారు. ఈ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు ఎటువంటి భద్రత లేదన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే పరిశ్రమ యజమానులు స్పందించడం లేదని వాపోయారు. వీటితోపాటు బీడీ, భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కూలిరేట్లు గానీ ప్రమాదబీమాగానీ రాష్ట్ర ప్రభుత్వం కల్పించలేదన్నారు. కార్మికుల సమస్యలపై భవిష్యత్తులో మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నాగభూషణం, సీఐటీయూ అధ్యక్షుడు, కార్యదర్శి అంజి, జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, ఉమాగౌడ్, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.



గుంతకల్లులో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నాగరాజు



పూర్వ విద్యార్థుల సమావేశం

కణేకల్లు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో 1999-2000లో పదో తరగతి చదివిన విద్యార్థులు 25 ఏళ్ల తర్వాత మళ్లీ అదే పాఠశాలలో ఆదివారం సమావేశయ్యారు. నాటి గురువులకు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పండిట్ హబీబ్, జయరాజ్, చిక్కణ్ణ, తిరుపాల్, వెంకటేశులు, పూర్వ విద్యార్థులు బీటీ మహేష్, ఫజ్లుద్దీన్, ఉంతకల్లు అహ్మద్, లోక్‌నాథ్, కోరి మోహన్, సప్తగిరి బాల, లోకి, శివరాజ్, మహ్మద్, వినోద్, ఇబ్రహీం, పెద్ద కోట్ల వాసు పాల్గొన్నారు.

అరుదైన రక్తం.. దానం



రక్తదానం చేస్తున్న పరశురాం

గుంతకల్లుటౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): లక్షల్లో ఒకరికి ఉండే అరుదైన 0 నెగిటివ్ బాంబే బ్లడ్‌ను స్థానిక ప్రాణదాత సేవా సమితి సభ్యుడు పరుశురామ్ పట్టణంలోని గోపిబ్లడ్ బ్యాంక్‌లో ఆదివారం దానం చేశాడు. హైదరాబాద్‌లో బసవతారకం కేన్సర్ హాస్పిటల్‌లో ఓ పేషంట్‌కు 0 నెగిటివ్ బాంబే బ్లడ్ రక్తం అవసరమైంది. పేషెంట్ బంధువులు రక్తం కోసం తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో గాలించినా ఫలితం లేకుండా పోయింది. చివరకు అదే బ్లడ్ గ్రూప్ ఉన్న గుంతకల్లు పట్టణంలోని ప్రాణదాత సేవా సమితి సభ్యుడు పరుశురాంను సంప్రదించారు. వెంటనే అతడు స్థానిక గోపి బ్లడ్ బ్యాంక్‌కు వచ్చి రక్తదానం చేశాడు. దీంతో పేషెంట్ బంధువులు పరుశురాం, ప్రాణదాత సేవా సమితి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా మహా గణారాధన

గుంతకల్లుటౌన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతగుంతకల్లులోని శ్రీశైల జగద్గురు సూర్యసింహాసన మఠంలో శ్రీశైల జగద్గురు నాగలూటి శివాచార్య మహాస్వామి 85వ గణారాధన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. స్వామి మూల విరాట్‌కు శ్రీ 1008 శ్రీశైల జగద్గురు డాక్టర్ చెన్న సిద్దా రామ శివ చార్య మహాస్వామి లింగధారణ, రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన, మహా మంగళ హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మఠం అభివృద్ధి మండల సభ్యులు పాటిల్ సిద్దారెడ్డి, మంతకల్ రెడ్డి, జీపీ తిమ్మారెడ్డి, బండారు రమేష్, కేశవ, మోహన్, మల్లప్ప పాల్గొన్నారు.



హారతి ఇస్తున్న శివాచార్య స్వామి

పార్కింగ్ పాట్లు



రోడ్డుపైనే ఉంచిన ద్విచక్రవాహనాలు

విడపనకల్లు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక కెనరా బ్యాంక్ వద్ద వాహనాల పార్కింగ్‌కు స్థలం లేకపోవడంతో ఖాతాదారులు తమ వాహనాలను రోడ్డు పక్కనే నిలుపుతున్నారు. బ్యాంక్‌లో క్యూలో నిల్చొని.. పని పూర్తి చేసుకోవడానికి కనీసం .. అర గంట నుంచి గంట సమయం పడుతోంది. అంతసేపు వారు వాహనాలు రోడ్డు పక్కనే పార్క్ చేస్తున్నారు. ఇది 42వ జాతీయ రహదారి కావడంతో నిత్యం భారీ వాహనాలు వెళ్తుంటాయి. పైగా పశువులు కూడా మందలు... మందలుగా ఆ రోడ్డుపై తిరుగుతున్నాయి. దీంతో ఇతర వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు ఈ సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కుర్చీలన్నీ ఖాళీ

ఎంపీడీఓ కార్యాలయంలో పాలన అస్తవ్యస్తం

బెళుగుప్ప, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి ఎప్పుడు వెళ్లినా ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయి. కార్యాలయంలో ప్రధాన పోస్టులు ఖాళీగా ఉండటంతో.. కింది స్థాయి సిబ్బంది ఆడింది ఆటగా .. పాడింది పాటగా సాగుతోంది. డిప్యూటీ ఎంపీడీఓ పోస్టు రెండు నెలలుగా ఖాళీగా ఉంది. జూనియర్ అసిస్టెంట్ రమణమూర్తి ఇక్కడ విధులోకి చేరి డిప్యూటేషన్‌పై పాఠశాలలో పనిచేస్తున్నారు. సీనియర్ అసిస్టెంట్ మూడు నెలలుగా సెలవులో ఉన్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కింది స్థాయి ఉద్యోగులు ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారు. ఏ అధికారి ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి ఉంది. అధికారులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సిబ్బందికి నియమించేలా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీఓ లక్ష్మీనారాయణను వివరణ కోరగా.. సిబ్బంది కొరత సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, మరోసారి నివేదికలు పంపి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.



ఎంపీడీఓ కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు



పతకాలతో చిన్నారులు

స్కేటింగ్‌లో ప్రతిభ

తాడిపత్రి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరుగుతున్న రాష్ట్రస్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో తాడిపత్రికి చెందిన చిన్నారులు బిల్వికరెడ్డి, ముక్తేశ్వరి ప్రతిభచూపి మొదటి, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారని కోచ్ సాంబశివ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా విభాగాల్లో ఇరువురు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారన్నారు. ఈ ఆ చిన్నారులను పలువురు అభినందించారు.

న్యూస్ బాక్స్



నిండిన కుంట

నిండిన నీటి కుంటలు

యాడికి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో పదిహేను రోజులుగా కురిసిన వర్షాలకు పలు గ్రామాల్లో నీటి కుంటలు, చెక్‌డ్యాంలు నిండాయి. యాడికి కాలువలో వర్షపు నీరు ప్రవహిస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో భూగర్భ జలాలు భారీగా పెరుగుతాయని తెలిపారు. పచ్చారుమేకలపల్లి, యాడికి వద్ద ఉన్న చెక్‌డ్యాంలు, నీటికుంటలు వర్షపునీటితో తొణికిసలాడుతున్నాయి.



పచ్చారుమేకలపల్లి వద్ద యాడికి కాలువ

2న కంటి వైద్యశిబిరం

తాడిపత్రి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్‌బజారులోని ఆర్వీ స్వామి కల్యాణ మండపంలో వచ్చే నెల 2న ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వాసవీక్లబ్ పట్టణ అధ్యక్షుడు శ్యాంప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు ఈ శిబిరంలో వైద్య సేవలు అందిస్తారని, ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 94409 89451 నంబరులో సంప్రదించాలని కోరారు.

29న మూడో విడత కౌన్సెలింగ్

ఉరవకొండ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మిగిలిన సీట్లు భర్తీ చేయడానికి ఈ నెల 29న మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 26లోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, 27న సర్టిఫికెట్ల వెరిఫికేషన్, 29న ఉదయం 10.30 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందని అన్నారు. వివరాలకు 99851 46746, 99493 61066 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గాల ఎన్నిక

రాయదుర్గం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం మూడు కార్యవర్గాలను స్థానిక ఇందిరాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి టీ రామాంజినేయులు వ్యవహరించారు. రాయదుర్గం పట్టణ అధ్యక్షుడిగా టీ రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున, రాయదుర్గం మండల అధ్యక్షుడిగా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా టీ సునీల్, గుమ్మఘట్ట మండల అధ్యక్షుడిగా పాండురంగ, ప్రధాన కార్యదర్శిగా సిద్దేశ్వర్‌ను ఎన్నుకున్నారు.

45 మంది రక్తదానం

రాయదుర్గం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజాపిత బ్రహ్మాకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శిబిరంలో 45 మంది రక్తదానం చేశారు. రాజయోగిని దాదిప్రకాశమణిజీ 18వ పవిత్ర స్మృతి సందర్భంగా దీన్ని నిర్వహించినట్లు ఓం శాంతి సంచాలకులు బీకే యోగేశ్వరి తెలిపారు.

హాస్టళ్లలో వసతులు కల్పించాలి

గుత్తి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో మౌలిక వసతులను కల్పించాలని హరిత దివ్యాంగుల రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశాడు. గిరిజన వసతి గృహాల్లో వసతులు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆయన ఆరోపించారు. వసతి గృహాలు మరమ్మతులు చేయించి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు.

'సంచార విముక్త దినోత్సవానికి తరలిరండి'

తాడిపత్రి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 30, 31 తేదీల్లో విజయవాడలో నిర్వహిస్తున్న సంచార జాతుల విముక్త జాతుల దినోత్సవానికి పెద్దఎత్తున తరలిరావాలని బీజేపీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పీవీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన కరపత్రాలను పట్టణంలోని బేడ బుడగ జంగాల కాలనీలో ఆదివారం ఆయన పంపిణీ చేశారు. సంచార సమాజంలో ఉన్న మేధావులు, నాయకులు, కుల పెద్దలు, యువత, మహిళలు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబరు అంకాల్‌రెడ్డి, నాయకులు ఆంజనేయులు, గంగాధర్‌యాదవ్, వీరభద్రయ్య పాల్గొన్నారు.

డీఎస్సీ విజేతలకు శుభాకాంక్షలు

తాడిపత్రి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో మెగా డీఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆదివారం అభినందనలు తెలిపారు. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా గొప్పదని, దాన్ని గుర్తించి మంచి గురువులుగా పేరుప్రఖ్యాతలు పొందాలని సూచించారు. డీఎస్సీ ద్వారా నిరుద్యోగ జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నిరుపయోగంగా ఈ-ఆటోలు

ఉరవకొండ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలోని ఈ ఆటో వాహనాలు తుప్పు పట్టిపోతున్నాయి. ఒక్కో దాన్ని రూ. లక్షలు వెచ్చించి.. కొనుగోలు చేసిన వాటిని పంచాయతీ కార్యాలయం ఆవరణంలో ఉంచారు. వాటిని ఇం తవరకూ ఒక్కసారి కూడా ఉపయోగించిన దాఖలాలులేవు. నిరుపయోగంగా ఉంచి ఆ ఆటోలు.. ఎండకు ఎండి.. వానకు తడిసి.. తుప్పు పట్టాయి. అధికారులు స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



తుప్పు పట్టిన ఆటోలు

క్రైం న్యూస్..

యువకుడి ఆత్మహత్య



జయకృష్ణ (ఫైల్)

యాడికి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమైందని జయకృష్ణ (22) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మండలంలోని ఓబులాపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాడికి మండలం ఓబులాపురం గ్రామానికి చెందిన బాలయంగన్న, సుశీల దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇద్దరూ ఎక్స్‌కవేటర్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. చిన్న కుమారుడు జయకృష్ణ ఒక అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. నెల రోజుల క్రితం ఆ అమ్మాయికి వేరే వ్యక్తితో వివాహమైంది. ప్రేమ విఫలమైందని జయకృష్ణ తరచూ బాధపడుతుండేవాడని, ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు, లారీ ఢీ - ముగ్గురికి గాయాలు



నుజ్జయిన కారు

పామిడి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొగరూరు గ్రామ సమీపాన 44వ జాతీయ రహదారి వంతెనపై కారును లారీ ఢీ కొన్న ప్రమాదంలో ముగ్గురు గాయ పడ్డారు. కర్నూలు నుంచి అనంతపురం వైపు వస్తున్న కారును... గుత్తి నుంచి అనంతపురం వస్తున్న లారీ వెనుకవైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో కారులోని భరత్ కుమార్ తీవ్రంగా... సాయి, దర్శన్‌కు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ప్రమాదానికి గురైన వాహనాలను తరలించి.. ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. గాయపడ్డవారిని పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చిన్నారులను చేరదీసిన కానిస్టేబుల్



హెడ్ కానిస్టేబుల్ వద్ద ఉన్న చిన్నారులు

పామిడి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పీ కొండాపురం రైల్వే ట్రాక్‌పై ఆదివారం ముగ్గురు చిన్నారులు కూర్చొని ఏడుస్తూ ఉండటాన్ని గమనించిన గ్రామస్థులు.. విషయాన్ని స్థానిక హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులుకు చేరవేశారు. ఆయన వెంటనే అక్కడి వెళ్లి.. ఆ పిల్లలను చేరదీశాడు. ఏడుస్తున్న ఆ పిల్లలకు ధైర్యం చెప్పి... పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చాడు. వారికి స్నానం చేయించి కొత్త దుస్తులు ఇప్పించి భోజనం పెట్టించాడు. చిన్నారులతో ఆరా తీయగా.. వారి పేర్లు సంపత్ కోలి, జయదీప్, కైలాశ్ అని.. వారు మహారాష్ట్ర కోలార్ ప్రాంతానికి చెందిన వారని గుర్తించాడు. గుత్తి రైల్వే స్టేషన్‌లో దిగి ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రైతుకు పాము కాటు

గుత్తిరూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బేదొడ్డి గ్రామానికి చెందిన రైతు బోగేశ్వరరెడ్డికి పొలంలో ఆదివారం పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురయ్యాడు. పొలంలో గడ్డి కోస్తున్న సమయంలో పాము చేతికి చుట్టుకొని.. చేతికి కాటు వేసింది. వెంటనే తోటి రైతులు అతన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు.

జూదరుల అరెస్ట్

రాయదుర్గంరూరల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్బీ వంక సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు అర్బన్ సీఐ జయనాయక్ ఆదివారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 5,500ను స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

టిప్పర్ ఢీకొని వృద్ధుడికి గాయాలు

తాడిపత్రి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిబాబా ఆలయ సమీపంలో ఓ టిప్పర్ ఢీకొనడంతో స్థానిక బంకమడివీధికి చెందిన వృద్ధుడు రామిరెడ్డి కాలు, చేతికి గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఆయన సాయిబాబా గుడికి వెళ్లి నంద్యాలరోడ్డులోకి వెళుతుండగా వెనుకవైపు నుంచి టిప్పర్ ఢీకొంది.

మహిళపై దాడి

తాడిపత్రి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక గాజులపాలెం వీధికి చెందిన అనూరాధపై అదే కాలనీకి చెందిన కృష్ణ ఆదివారం దాడి చేసి గాయపరిచాడు. అనూరాధ, కృష్ణ ఇరువురు ఇళ్లు పక్కపక్కన ఉండడంతో.. ఇంటి సమస్యపై మాటమాట పెరిగింది. కృష్ణ ఆమెపై దాడిచేసి గాయపరిచాడు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విద్యార్థికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

తాడిపత్రి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గుంతకల్లుకు చెందిన బిందు స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమో చదువుతోంది. బిందు నాన్న మరణించడంతో తల్లి రాధమ్మ ఆమెను చదివిస్తోంది. బిందు హాస్టల్ ఫీజు, పుస్తకాల కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న స్థానిక ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. ఆదివారం స్థానిక శ్రీ వివేకానంద పాఠశాల ఆవరణంలో బిందు, రాధమ్మకు రూ. 25 వేల ఆర్థికసాయం అందజేశారు. ఇందులో ఆసేవా సంస్థ కన్వీనర్ శ్రీహ రి, గౌరవ అధ్యక్షుడు గుర్రప్ప, ప్రధాన కార్యదర్శి రామేశ్వర్‌రెడ్డి, శ్రీ రంగయ్య, కుమారస్వామి, ఎంఈఓ-2 రామగోవిందరెడ్డి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు

ఉరవకొండ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక జామియా మసీదు వద్ద నున్న జామియా తాసీరియా ఎడ్యుకేషనల్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 207 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి సెప్టెంబరు ఆరో తేదీన బహుమతులు అందజేస్తారు. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని మిలాడి-ఉన్-నబీ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు